క్లుప్తంగా

నేడు స్పీకర్ ఎన్నికల ప్రచారం

సరుబుజ్జిలి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం శాసనసభ స్పీకర్, ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు గురువారం ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి కొండవలస, పెద్దపాలెం, రావివలస, సింధువాడ, పెద్దసవలాపురం, షళంత్రి, కొత్తకోట, రొట్టవలస పంచాయతీల్లో ప్రచారం చేస్తారన్నారు.

వైద్య తనిఖీలు చేయండి

సరుబుజ్జిలి: గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించి ప్రజల స్థితిగతులు తెలుసుకోవాలని వైద్యాధికారి సంతోష్‌కుమార్ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని వ్యాసులుపేట, తురకపేట, దుబ్బులుపేట గ్రామాల్లో గురువారం పర్యటించారు. వేసవిలో కలుషిత నీటిని తాగడం వల్ల వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వాహనాలపై ప్రత్యేక నిఘా


కారును తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

పాతపట్నం: ఆంధ్ర, ఒడిశా నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టి, క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎ.శైలజ తెలిపారు. పాతపట్నం మార్కెట్ యార్డ్ ఎదురుగా జాతీయ రహదారిపై గురువారం వాహనాలను పోలీసుల ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ వాహనాలను, బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. వాహన తనిఖీల్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి ఘటనపై విచారణ


విచారణ జరుపుతున్న డీఎస్పీ విజయకుమార్

పొందూరు: ఏప్రిల్ 15వ తేదీన రాపాక కూడలి సమీపంలోని మద్యం దుకాణం వద్ద గేదెల రాముపై జరిగిన దాడి ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ విభాగం శ్రీకాకుళం డీఎస్పీ పి.విజయకుమార్ గురువారం విచారణ జరిపారు. ముగ్గురు వ్యక్తులు కత్తితో దాడి చేసి రామును గాయపరిచారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎస్పీ తెలిపారు.

32 మద్యం సీసాలు స్వాధీనం


పట్టుబడిన మద్యం సీసాలను చూపుతున్న ఎస్ఈబీ ఎస్ఐ రామకృష్ణ

పొందూరు: మండలంలోని పలు గ్రామాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ ఈ.రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన తనిఖీల్లో 32 మద్యం సీసాలు పట్టుకున్నారు. కింతలి పంచాయతీ ఖాజీపేట గ్రామంలో పల్ల అసిరినాయుడు వద్ద 12 మద్యం సీసాలు, కోటిపల్లి గ్రామానికి చెందిన మహిళ వద్ద 20 మద్యం సీసాలు అక్రమంగా నిల్వ ఉంచడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఈబీ సిబ్బంది ఉన్నారు.

బైక్ ర్యాలీ విజయవంతం చేయాలి

కొత్తూరు: ఈ నెల 3వ తేదీ సాయంత్రం 3.30 గంటలకు వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పార్టీ సీనియర్ నాయకుడు, కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ గురువారం తెలిపారు. బైక్ ర్యాలీలో పాతపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొంటారన్నారు. బైక్ ర్యాలీ దాశరధీపురం, కాశీపురం, నీలకంఠాపురం, మెట్టూరు బిట్-1, 2, 3 ఆర్ఆర్ కాలనీలు, గూనభద్ర ఆర్ఆర్ కాలనీ, కలిగాం, బమ్మిడి, కలిగాం, జోగిపాడు, ఉప్పరిపేట, నేరడి గ్రామలతోపాటు 18 గ్రామాల్లో ఉంటుందన్నారు. బైక్ ర్యాలీలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూర్యనారాయణ కోరారు.

నేడు అసిరితల్లి ఆలయ వార్షికోత్సవం

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామ అసిరితల్లి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు గురువారం ప్రకటనలో వెల్లడించారు. వార్షికోత్సవంలో భాగంగా ఘటాభిషేకాలు, కుంకుమార్చనలు, సహస్రనామార్చనలు నిర్వహించన్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారి సన్నిధానం ఆవరణలో అన్నప్రసాదవితరణ ఉంటుందన్నారు.

టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ హరిపురం గ్రామంలో లబ్ధిదారుల చెంతకే ఎండియూ వాహనాలతో రేషన్ సరుకులు ఇస్తున్న ఆపరేటర్లు (ఫైల్)



గుర్తున్నాయా ఆ రోజులు.. రేషన్ తీసుకోవాలంటే గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. వేలి ముద్ర పడకపోయినా, నెట్‌వర్క్ లేకపోయినా నిరాశగా వెనుదిరగాల్సి వచ్చేది. కూలి పని మానుకుని మరీ డీలర్ షాపు వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు ఉండేవి. మరి ఇప్పుడో.. ఇంటి వద్దకే వాహనం వస్తోంది. పెద్దగా ప్రయాస లేకుండానే రేషన్ అందుతోంది.
ఈ ఎండీయూ వాహనాల ద్వారా యువతకు ఉపాధి కూడా దొరికింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలు ఇది.

రేషన్ బండి..
కష్టాలు తీరాయండి

- విప్లవాత్మకంగా ఇంటికే రేషన్ పంపిణీ పథకం
- గత ప్రభుత్వంలో రోజుల తరబడి పడిగాపులు
- ఎండీయూ వాహనాలతో యువతకు ఉపాధి



టెక్కలి:

టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ పరిధి హరిపురం గ్రామానికి చెందిన రోణంకి ఆదిలక్ష్మి ఐదేళ్ల కిందటి వరకు రేషన్ బియ్యం కోసం ఐదు కిలోమీటర్ల దూరంలోని లింగాలవలస వెళ్లేవారు. అక్కడ రెండు మూడు రోజులు పడిగాపులు కాస్తే తప్ప రేషన్ అందేది కాదు. ఒక్కోసారి సాంకేతిక కారణాలు చెప్పి రేషన్ బియ్యం ఇచ్చేవారు కాదు. ఆదిలక్ష్మికే కాదు వేలాది మందికి ఇదే పరిస్థితి ఎదురయ్యేది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలతో ఈ అవస్థలన్నీ మటుమాయమైపోయాయి. ఇంటి వద్దనే రేషన్ బియ్యం అందుతోంది. గత టీడీపీ ప్రభుత్వం పాలన వరకు జిల్లా వ్యాప్తంగా మారుమూల గిరిజన గ్రామాలు, పల్లెల్లో రేషన్ లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందేది కాదు. ఒక్కో నెల సాంకేతిక కారణాలతో రేషన్ బియ్యం అందని దుస్థితి ఉండేది. అలాంటి పరిస్థితులకు స్వస్తి పలికేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ పథకం ఒక విప్లవాత్మకంగా మారింది. ఈ పథకం ద్వారా ఒక వైపు లబ్ధిదారు ల చెంతకే రేషన్ అందడంతో పాటు సుమారు 844 మంది నిరుద్యోగ యువతకు ఎండీయూ వాహనాల ద్వారా ఉపాధి లభించింది.

422 ఎండీయూ వాహనాలతో..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన ఇంటి వద్దకే రేషన్ వ్యవస్థతో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 422 ఎండీయూ వాహనాలతో ప్రతీ నెల 6,74,871 రైస్ కార్డుల్లో ఉన్న సుమారు 19,88,491 సభ్యులకు రేషన్ సరుకులు అందజేస్తున్నారు. ఈ వ్యవస్థ వల్ల ప్రతి నెలా ఇంటి వద్దకే రేషన్ అందుతోందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పనులు మానుకునేవాళ్లం



తెలుగుదేశం ప్రభుత్వంలో రేషన్ బియ్యం కావాలంటే, మా కూలి పనులు మానుకుని రోజుల తరబడి టెక్కలిలో డీలర్ దగ్గరకు, మా ఊరికి తిరిగే వాళ్లం. ఒక్కో సారి బియ్యం ఇచ్చే వాళ్లు కాదు. బియ్యం లేకపోవడంతో మా ఊరిలో అందరూ ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు జగనన్న పాలనలో మా ఊరికే రేషన్ బియ్యం వస్తున్నాయి.
– కిల్లాన రిబ్బిక, సవరగోపాలపురం, టెక్కలి మండలం.

రోజుల తరబడి తిరిగేవాళ్లం



గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి నెల రేషన్ బియ్యం కోసం రోజుల తరబడి తిరిగేవాళ్లం. ఉదయాన్నే ఇంటి నుంచి ఆటోలతో బయల్దేరి రేషన్ డిపో దగ్గరకు వెళితే, అక్కడ గంటల కొద్దీ కాపలా కాసేవాళ్లం. ఒక్కో సారి రెండు మూడు రోజులు గడచిన తర్వాత రేషన్ బియ్యం ఇచ్చేవాళ్లు. ఇప్పుడు మా ఊరికే రేష న్ బండి వస్తోంది. సీఎం జగన్ బాబు దయ వల్ల రేషన్ కష్టాలు తీరాయి.
– రోణంకి ఆదిలక్ష్మి, హరిపురం, లింగాలవలస పంచాయతీ, టెక్కలి మండలం

ఫ్లాగ్ మార్చ్

ఆమదాలవలస రూరల్: మండలంలోని వంజంగి, కణుగులవలస గ్రామాల్లో సీఐ దివాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలు కలిసి గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు అన్ని విధాలా సహకరించాలని ప్రజలను కోరారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులకు సహకరించవద్దని ప్రజలను కోరారు. ఎన్నికల దృష్ట్యా ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో కార్డన్ సెర్చ్

కొత్తూరు: ఈ నెల 13 తేదీన జరుగునున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కొత్తూరు, నేతాజీనగర్ కాలనీల్లో కొత్తూరు సీఐ ఆర్. వేణుగోపాలరావు ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్‌లు గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కొత్తూరు, నేతాజీనగర్ కాలనీలోని ప్రధాన రహదార్లులో పోలీస్‌లు ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ప్రశాంత వాతావరణంలో ఓటు వేయాలన్నారు. స్థానిక ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు..

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని కొత్తూరు సీఐ వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని దిమిలి గ్రామంలో గురువారం రాత్రి ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. గొడవల జోలికి వెళ్లద్దన్నారు.


వంజంగిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు


కొత్తూరులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సీఐ ఆర్‌వేణుగోపాలరావు, కేంద్ర పోలీసులు

శిలాఫలకాల కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి

ఎల్.ఎన్.పేట: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి ఆధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి తీర్మానాలు చేయలేమని, సమస్యలు తెలియజేస్తే వాటిని ప్రాధాన్యత క్రమలో పరిష్కరిస్తామని ఎంపీడీఓ గిరిబాల తెలిపారు. యంబరాం సర్పంచ్ వెలమల గోవిందరావు మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి హామీ పథకం పని ప్రదేశాల్లో పని వివరాలు తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేశారని, వాటిని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కూల్చి వేశారని సభ దృష్టికి తెచ్చారు. పోలీసు కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని కోరారు. వాస్తవ పరిస్థితిని పరిశీలించి సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి వివరాలతో పాటు ఫిర్యాదు తీసుకుని పోలీసు కేసు నమోదు చేస్తామని ఎంపీడీఓ తెలిపారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి కోరారు. సమావేశాన్ని పది నిమిషాల్లో పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఐ.పద్మజ, ఉపాధి హామీ పథకం ఏపీఓ వి.శ్రీదేవి, ఐకేపీ ఎంపీఎం రవిరాజ్, ఎంపీటీసీ ఎం.తులసమ్మ, కో ఆప్షన్ సభ్యుడు రామ్‌నాథ్ పాణిగ్రహి, తురకపేట, చొర్లంగి, సిద్ధాంతం సర్పంచ్‌లు మొదవలస యోగీశ్వరి, సవర గంగమ్మ, గాది కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాల కూల్చివేతను అధికారులకు వివరిస్తున్న సర్పంచ్ గోవిందరావు

- వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలతో ఎంతో మేలు
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు తమ్మినేని సీతారాం, రెడ్డి శాంతి

ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి


మెళియాపుట్టి: ఎమ్మెల్యే వెంట బైక్‌లతో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు, అభిమానులు


ఆమదాలవలస: 13వ వార్డులో ప్రచారం చేస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్


సత్యజగన్నాథపురంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఆమదాలవలస రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కణుగులవలస, వంజంగి, వంజంగిపేట పంచాయతీల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్పీకర్‌కు ఆయా గ్రామాల ప్రజలు స్వాగతం పలికారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను ఎమ్మెల్యేగా, శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, మండల సచివాలయాల కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్, సచివాలయ కన్వీనర్ పొన్నాడ రాము, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండల కేంద్రంలో ప్రారంభమై బైక్ ర్యాలీ గొప్పిలి వరకు 30 కిలో మీటర్ల మేర పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలాదిగా హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ద్విచక్ర వాహనాలతో కదిలారు. ఎమ్మెల్యేకు ప్రజలు అడుగడుగునా స్వాగతం పలికారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిందే చేస్తారని, గత ఐదేళ్ల పరిపాలనలో మహిళలు, వృద్ధులు, బడుగు, బలహీన వర్గాలకు జగనన్న చేసిన మేలును గుర్తించి ఓట్లు వేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ, మండల నాయకుడు ఉదయ్‌కుమార్, కోప్షన్ సభ్యుడు భాస్కర్ దాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు యు.బాలరాజు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శశిభూషణ్ రావు, మండల కన్వీనర్ పల్లి యోగి, నాయకులు, యువత పాల్గొన్నారు.

మీ సేవకురాలిని.. ఆదరించండి

హిరమండలం: నేను మీలో ఒకరిని.. ఆదరించండి అందరకీ అండగా ఉంటానని పాతపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని సత్యజగన్నాథపురం, చవితి సీది, పింప్రువాడ కాలనీ, కొత్తగూడ, భగిరథిపురం కాలనీ పరిధిలో ఉపాధి పనుల జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి వేతనదారులకు ఈ ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనను వివరించారు. మళ్లీ అవకాశమిస్తే మరింత సంక్షేమాన్ని అందిస్తామని మేనిఫెస్టోను వివరించారు. చంద్రబాబు బూటకపు హామీ, టీడీపీ నాయకుల మాయ మాటలను నమ్మవద్దన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మేం సిద్ధమని నినాదాలు చేస్తున్న సత్యజగన్నాథపురం ఉపాధి వేతనదారులతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రచార పర్వం

పాతపట్నం: మండలంలోని సరాలి, చంగుడి, దశరధపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు జెడ్పీటీసీ సభ్యురాలు లింగాల ఉషారాణి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో పాతపట్నం ఎమ్మెల్యేగా రెడ్డి శాంతిని, ఎంపీగా పేరాడ తిలక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజప్తి చేశారు. పార్టీ సచివాలయ మండల కన్వీనర్ ఎనుగుతల సూర్యం, ఎస్టీ సెల్ అధ్యక్షుడు జి.అప్పన్న, జి.రాము, నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస రూరల్: మండలంలోని గాజులకొల్లివలస నిర్వాసిత కాలనీలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాంను, శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు చిన్నబాబు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి రెండో వార్డు కృష్ణాపురం, 13వ వార్డు ధర్మారావు క్వార్టర్స్, కాలేజీ వీధి, సాయినగర్ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు సనపల మోహన్‌సురేష్, కూన రామకృష్ణ, దుంపల శ్యామలరావు, పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ ఎ.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలంలోని బలద, బలద కాలనీల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఓం శ్రీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్‌గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా రెడ్డి శాంతి, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు సారిపల్లి ప్రసాదరావు, బలద సర్పంచ్ సారిపల్లి భారతి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ తోట నందకుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


చీడివలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

వైఎస్సార్‌సీపీని గెలిపించండి

బూర్జ: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందజేశారని స్పీకర్, ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని చీడివలస, గంగంపేట, తోటవాడ, టీఆర్ రాజుపేట, సంకురాడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనను ఎమ్మెల్యేగా, శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


చీడివలసలో రోడ్ షో నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని


ఆమదాలవలస రూరల్: గాజులకొల్లివలస నిర్వాసిత కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న చిరంజీవినాగ్


ఆమదాలవలస రూరల్: వంజంగిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తమ్మినేని సీతారాం


ఆమదాలవలస రూరల్: కణుగులవలస వద్ద బైక్ ర్యాలీతో స్పీకర్ తమ్మినేని సీతారాంకు స్వాగతం పలుకుతున్న అభిమానులు


కొత్తూరు: బలదలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రెడ్డి ఓం శ్రీకృష్ణ


మెళియాపుట్టి: జాడుపల్లి వద్ద ఎమ్మెల్యే రెడ్డి శాంతిని గజమాలతో సత్కరిస్తున్న సర్పంచ్‌లు, నాయకులు.


పాతపట్నం: దశరథపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు